www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

1 వ వార్షికోత్సవం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 21 | | 25-6-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |



'సీతారామ' మట్టి దోపిడీ వెనుక మంత్రి తుమ్మల
విలేకరుల గౌరవానికి తగ్గట్టుగా కార్డులు ఇవ్వాలి
సత్తుపల్లి సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## ముగ్గురు మంత్రులతో ఖమ్మంకు ఒరిగింది శూన్యం

**ఆర్సత్తుపల్లి/ఖమ్మం, జూన్ 24 :** 'రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఈ దుర్మార్గ పాలన పోవాలి.. కేసీఆర్ పాలన రావాలి అని ప్రజలు కోరుతున్నారు.. కాంగ్రెస్ మాయమాటలు విని మోసపోతే గోస తప్పదని ఆనాడే కేసీఆర్ చెప్పారు.. రెండున్నరేళ్ల ఈ అసమర్థ పాలనలో జరిగిన నష్టం ఏంటో ఆలోచించండి.. కాంగ్రెస్ హయాంలో మోసపోని వర్గం లేదు.. కుప్పకూలని రంగం లేద'ని బీఆర్ఎస్

మిగతా 2వ పేజీలో..

## కరీంనగర్‌లో మళ్లీ కారు సునామీ ఖాయం 3

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం



- 15.9 టీఎంసీలకు బదులు 5-6 టీఎంసీలే అందుతున్నాయని ఆవేదన
- తుంగభద్ర బోర్డును పటిష్టం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
- ఆర్డీఎస్, తుమ్మిళ్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 24:** "తుంగభద్ర జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. చట్టబద్ధంగా రావాల్సిన 15.9 టీఎంసీలకు బదులు కేవలం 5 నుంచి 6 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తుంగభద్ర జలాల పంపిణీలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తెలంగాణ హక్కులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.
హైదరాబాద్‌లోని జలసౌధలో బుధవారం నిర్వహించిన నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో

మిగతా 2వ పేజీలో..

### నేడు కర్ణాటకకు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

- తుంగభద్ర జలాలపై ఏపీ, తెలంగాణ సీఎంల కీలక భేటీ 2



## ఆ నలుగురి మాటలు నమ్మితే అధోగతే



- ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం
- మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల 2



### తుంగభద్ర జలాల్లో రాష్ట్ర హక్కులు తాకట్టు

- ఈ కుట్రలను తక్షణమే ఆపాలి
- రాష్ట్ర జల హక్కులను బేరసారాల అంశంగా మార్చారు
- సీఎంకు బీఆర్ఎస్ నేత హరీష్ రావు లేఖ 2

## ఢిల్లీలో తెలంగాణకు సొంత చిరునామా ఎప్పుడూ?

విభజనకు 12 ఏళ్లు.. ఇంకా ఆంధ్ర భవన్‌లోనే తెలంగాణ కార్యాలయాలు
పటౌడీ హౌజ్‌లో తెలంగాణ భవన్ నిర్మాణం ఆలస్యం
సొంత భవనం లేక అధికారుల్లో ఆందోళన
కొత్త ఏపీ భవన్‌కు కేబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ:** రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణకు ఇప్పటికీ సొంత భవనం అందుబాటులోకి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. విభజన అనంతరం తాత్కాలిక ఏర్పాట్లతో కొనసాగుతున్న తెలంగాణ భవన్ వ్యవహారం ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిష్కారం కాకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఢిల్లీలోని ఆంధ్ర భవన్ తెలుగు ప్రజలకు ముఖ్య

మిగతా 2వ పేజీలో..

## సీఎం రేవంత్ కు హైకోర్టులో ఊరట



- కోవిడ్-19 నాటి కేసు కొట్టివేత


**హైదరాబాద్, జూన్ 24 :** సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2021లో జరిగిన

మిగతా 3వ పేజీలో..

## యూరియా ఇవ్వకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు ధర్నా: పొన్నం

- తెలంగాణకు అవసరమైన ఎరువులు ఇవ్వాల్సింది కేంద్ర బాధ్యత
- రాష్ట్రానికి వివక్ష చూపుతున్నారని ఆరోపణ 3





### కమ్యూనిజానికే భవిష్యత్తు: కూనంనేని

అసమానతలు పెరుగుతున్న కొద్దీ వామపక్షాల ప్రాధాన్యం పెరుగుతుంది
నిరుద్యోగం, ధరల పెరుగుదలతో ప్రజల్లో అసంతృప్తి
కమ్యూనిస్టు శక్తుల ఐక్యత అవసరమని పిలుపు 3

### వ్యాపారులకు టీజీఎస్ఆర్టీసీ గోల్డెన్ ఛాన్స్

రాష్ట్రవ్యాప్తంగా 694 షాపులకు త్వరలో టెండర్లు
ఆన్‌లైన్‌లో కమర్షియల్ కాంప్లెక్స్‌ల పూర్తి వివరాలు
ఆదాయం పెంపుతో పాటు ఉపాధి అవకాశాలే లక్ష్యం 3



## ఉత్తర అమెరికాలో తెలుగు సంబరం.. ఘనంగా మాటా మహాసభలు


- తెలుగు సంస్కృతికి ప్రపంచ వేదిక
- 7,500 మందికి పైగా తెలుగు కుటుంబాల హాజరు
- డీఎస్పీ, సినీ తారల సందడితో కళకళలాడిన వేడుకలు
- జయప్రదకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

**ఫిలడెల్ఫియా, జూన్ 24:** ఉత్తర అమెరికాలో తెలుగు సంస్కృతి, సేవా కార్యక్రమాలు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన 'మన అమెరికన్ తెలుగు అసోసియేషన్' (మాటా) రెండో మహాసభలు అట్టహాసంగా జరిగాయి. పెన్సిల్వేనియాలోని గ్రేటర్ ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలు తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయి. దాదాపు 7,500

మిగతా 3వ పేజీలో..

## అక్రమ సెక్యూరిటీ ఏజెన్సీలపై ఉక్కుపాదం

- కరీంనగర్‌లో ఏడు సంస్థలపై కేసులు నమోదు
- పీఎస్ఏఆర్‌పి లైసెన్స్ లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలకు పోలీసుల సిద్ధత




**కరీంనగర్, జూన్ 24:** రాష్ట్రంలో చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న సంస్థలను గుర్తించి వాటిపై చర్యలు చేపట్టేందుకు ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ ప్రత్యేక దృష్టి సారించింది.
ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్, ఓఎస్‌డీ వి.బి. కమలాసన్ రెడ్డి ఆదేశాల మేరకు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు పాటించకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు.

**షోకాజ్ నోటీసులకు స్పందన లేదు**

లైసెన్స్ లేకుండా సెక్యూరిటీ సేవలు అందిస్తున్న సంస్థలకు గతంలోనే పోలీసులు షోకాజ్

మిగతా 3వ పేజీలో..



### సర్ ప్రక్రియలో పేరు తొలగింపు

- రేషన్ నిరాకరణపై సుప్రీం ఆశ్చర్యం 2

## హెచ్‌సీఏలో పోరు.. హైకోర్టు ముందుకు అప్పీలు

**హైదరాబాద్, జూన్ 24:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు, ఆర్థిక అక్రమాల ఆరోపణల వ్యవహారం హైకోర్టు ద్విసభ్య

మిగతా 2వ పేజీలో..



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుంగభద్ర బోర్డు పరిధిలో తెలంగాణకు దక్కాల్సిన నీటిని పూర్తిస్థాయిలో అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలు ఎక్కువ నీటిని వినియోగించుకుంటుండటంతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందన్నారు.
నీటి పంపిణీ పారదర్శకంగా, న్యాయబద్ధంగా జరగాలంటే తుంగభద్ర బోర్డును మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2004 నిపుణుల కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం రాజీపడదని స్పష్టం చేశారు.
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కీలకమైన రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ పనుల పురోగతి పైనా సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 83,987 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నప్పటికీ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ.59 కోట్లు చెల్లించినా ఇప్పటికీ పనులు పూర్తికాకపోవడాన్ని తప్పుబట్టారు.
ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీ1, ప్యాకేజీ2 పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మహబూబ్‌నగర్ రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా మల్లమ్మకుంట రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.
తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పనులను కూడా వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి జాప్యం లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు హక్కుగా దక్కాల్సిన సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# తుంగభద్ర జలాల్లో రాష్ట్ర హక్కులు తాకట్టు

**హైదరాబాద్,జూన్ 24 :**

రాష్ట్ర జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తోందని అసెంబ్లీలో బీఆరఎస్ ఉప నాయకుడు టి.హరీష్‌రావు ఆరోపించారు. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఏపీకి పూర్తి సహకారం అందిస్తున్న మీరు ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కర్ణాటక నుంచి ఎన్‌వోసీ తెస్తున్నాం అనే సాకు చెప్పి రాష్ట్ర జల హక్కులను బేరసారాల అంశంగా మార్చారా అని నిలదీశారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి, చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జికంబ్యారేజిలకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా అని అడిగారు. 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక మతలబు ఏమిటన్నారు. ఏడాదిగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా అని నిలదీశారు. కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా.. లేక తెలిసే ఇదంతా చేస్తున్నారా అని అడిగారు. రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతలను రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్‌టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా అని హరీష్‌రావు నిలదీశారు. సీడబ్ల్యూసీ, కేఆరఎంబీ, తెలంగాణ, ఏపీల అనుమతులు లేకుండానే తుంగభద్రపై కర్ణాటక ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే దీన్ని వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదన్నారు. దీని వెనుక ఉన్న లోపాయికార ఒప్పందాలు ఏమిటని ఆయన అడిగారు. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా 1.2 టిఎంసి మాత్రమే. కానీ సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుందని, ఆర్డీఎస్ నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుందని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన ఆర్డీఎస్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేసీఆర్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించిందని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రారంభించిన ఆర్డీఎd ఫేజ్ 2ను పడావు పెట్టిన మీరు ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తోపాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. చివరి దశలో ఉన్న పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణపేట, కొడంగల్‌కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా దాన్ని పక్కనబెట్టారని ఆరోపించారు. కమీషన్ల కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీశారన్నారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. 'తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను తక్షణమే అడ్డుకోవాలి.. సీడబ్ల్యూసీ, కేఆరఎంబీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు అభ్యంతరాలు తెలియజేయాలి.. తుంగభద్ర జలాల వినియోగంలో బచావత్ ట్రిబ్యునల్ నిబంధనలను కర్ణాటక తు.చ తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే సుప్రీం కోర్టులో కేసు వేయాలి.. కమీషన్ల కొడంగల్ లిఫ్ట్ కోసం రాష్ట్ర జల హక్కులను బేరసారాల అంశంగా మార్చలేదని ప్రభుత్వం నిరూపించాలి' అని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సమైక్య పాలనలో కృష్ణా జలాల కేటాయింపులో, వినియోగంలో జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన పాలమూరు ప్రజలు తమ జల హక్కులను కాపాడుకోవడానికి మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి తీసుకురావద్దని హెచ్చరిస్తున్నామన్నారు.



## సర్ ప్రక్రియలో పేరు తొలగింపు

**న్యూఢిల్లీ, జూన్ 24:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతో జాబితా నుంచి పేరు తొలగింపునకు గురైన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టును కాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దీంతో పిటిషనర్ తరపు న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.

## ముగ్గురు మంత్రులతో ఖమ్మంకు ఒరిగింది శూన్యం

మొదటిపేజీ తరువాయి

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అధ్యక్షతన బీఆర్ఎస్ కార్యకర్తలకు బుధవారం నిర్వహించిన 'ఎస్ఐఆర్' అవగాహన కార్యక్రమం, పార్టీ సభ్యత్వ నమోదు సభలో ఆయన మాట్లాడారు. తొలిసారి రైతుకు పెట్టుబడి సాయం అందించాలన్న ఆలోచన చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని, 72 లక్షల మంది రైతుల ఖాతాలో రూ.73 వేల కోట్లు వేసిన ఘనత ఏకైక ముఖ్యమంత్రిగా ఆయనకు దక్కిందన్నారు. ఈ ముఖ్యమంత్రి రేవంత్ 72 సార్లు ఢిల్లీకి పోయి పైసా తెచ్చింది లేదని ఆరోపించారు. పవర్ ఫుల్ శాఖలన్నీ ఖమ్మంలోని ముగ్గురు మంత్రుల చేతిలోనే ఉన్నాయని, ఈ ముగ్గురితో జిల్లాకు ఒరిగింది శూన్యమని అన్నారు. షాపుల్లో లేని యూరియా యాప్ లో ఎక్కడ ఉంటదని ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మెజారిటీ స్థానాలు కట్టబెడితే యూరియా యాప్ ను బంగాళాఖాతంలో పడేస్తాం.. మళ్లీ ఆటో అన్నకు ఫోన్ చేస్తే పొలం కాడికి యూరియా ఇచ్చి పోయే రోజులు తెస్తాం అని చెప్పారు. నియోజకవర్గాల్లో పనిచేసే విలేకరులకు బీఆర్ఎస్ హయాంలో అక్రిడేషన్ కార్డులు ఇచ్చే వాళ్లం.. కాంగ్రెస్ హయాంలో వాటి విషయంలోనూ అన్యాయం చేస్తున్నారన్నారు. ఐ అండ్ పీ ఆర్ మంత్రి పొంగులేటి విలేకరుల గౌరవానికి తగ్గట్టుగా కార్డులు ఇవ్వాలని కోరుతున్నా అన్నారు. లేకపోతే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. గ్యారంటీ కార్డుల అంశం ప్రస్తావిస్తూ కమల్ హాసన్ ను మించిన భట్టి యాక్టింగ్ చేశారని తీవ్ర విమర్శలు చేశారు. మరో ఇద్దరు మంత్రులైన తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలపైనా కేటీఆర్ పలు ఆరోపణలు చేశారు. సత్తుపల్లి బుగ్గపాడు ఫుడ్ పార్క్ లో మార్కెట్ విలువకు విరుద్ధంగా భూములు విక్రయించారని ఆరోపించారు. రూ.40 లక్షల ప్రభుత్వ ధర ఉంటే రూ.21 లక్షలకు ప్రైవేట్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిందన్నారు. కోట్ల రూపాయలు సీతారామ ప్రాజెక్టు మట్టిని దోపిడీ చేస్తున్నారని, దీనికి వెనుక తుమ్మల ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావు, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.



## నేడు కర్ణాటకకు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, జూన్ 24:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటకలో గురువారం పర్యటించనున్నారు. హోస్పేట వద్ద ఉన్న ప్రముఖ అంతర్రాష్ట్ర ప్రాజెక్టు తుంగభద్ర జలాశయానికి నూతనంగా ఏర్పాటు చేసిన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు హాజరుకాబోతున్నారు. కర్ణాటక ప్రభుత్వ అధికారిక ఆహ్వానం మేరకు ఈ పర్యటనకు వెళ్తున్నట్లు సమాచారం. గతంలో తుంగభద్ర డ్యామ్ గేట్లు కొట్టుకుపోయిన చేదు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కర్ణాటక ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా యుద్ధప్రాతిపదికన కొత్త గేట్ల ఏర్పాటు పనులను చేపట్టింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనులు విజయవంతంగా పూర్తి కావడంతో రేపు ఈ నూతన గేట్ల భారీ ప్రారంభోత్సవ వేడుకను నిర్వ హించనున్నారు.

**అంతర్రాష్ట్ర జల సంబంధాల బలోపేతం, ఆర్డీఎస్ పై చర్చ?**

తుంగభద్ర బోర్డు పరిధిలో తెలంగాణ కూడా ఒక ముఖ్య భాగస్వామిగా ఉంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన అంతర్రాష్ట్ర జల సంబంధాల బలోపేతానికి ఎంతగానో దోహదపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రానికి కీలకమైన రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) వంటి పెండింగ్ ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి, నీటి వాటా వివాదాలు సద్దుమణిగేందుకు ఈ వేదిక ఒక మంచి అవకాశంగా మారే వీలుంది.

## ఢిల్లీలో తెలంగాణకు సొంత చిరునామా ఎప్పుడూ?

మొదటిపేజీ తరువాయి

కేంద్రంగా ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత ఆస్తుల పంపకాలు పూర్తయ్యే వరకు ఒకే భవనంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు తమ పరిపాలనా కార్యకలాపాలను కొనసాగించాయి. ఈ కారణంగా ఒకే ప్రాంగణంలో రెండు రాష్ట్రాల కార్యాలయాలు ఉండటం ప్రత్యేక పరిస్థితిగా మారింది.
భవనాల విభజన ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రస్తుతం ఉన్న ఆంధ్ర భవన్ మొత్తం ఆంధ్రప్రదేశ్ వాటాలోకి వెళ్లింది. తెలంగాణకు పటౌడీ హౌజ్ ప్రాంతంలో ఉన్న స్థలం కేటాయించగా, అక్కడ కొత్త తెలంగాణ భవన్ నిర్మించాల్సి ఉంది. అయితే అనుమతులు, ప్రణాళికలు సిద్ధమైనప్పటికీ నిర్మాణ ప్రక్రియ ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
రాష్ట్ర ప్రభుత్వాలకు ఢిల్లీలోని భవనాలు అత్యంత కీలకమైనవి. ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారిక పనుల కోసం వచ్చే ప్రజలు అక్కడే బస చేస్తుంటారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసే రెసిడెంట్ కమిషనర్ కార్యాలయాలు కూడా ఈ భవనాల్లోనే పనిచేస్తాయి. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణకు సొంత భవనం లేకపోవడం పరిపాలనాపరంగా ఇబ్బందులు సృష్టిస్తోందని అధికారులు భావిస్తున్నారు.
కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగిన పంపకాల ప్రకారం ఢిల్లీలోని భూముల్లో ఆంధ్రప్రదేశ్‌కు 11.5 ఎకరాలు, తెలంగాణకు 8.2 ఎకరాలు కేటాయించారు. ఈ భూముల విలువ వేల కోట్ల రూపాయలుగా అంచనా వేయబడుతోంది. తెలంగాణకు కేటాయించిన స్థలంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన భవనం నిర్మించాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించినా, పనులు ఇంకా ప్రారంభం కాలేదు.



మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకు కేటాయించిన స్థలంలో కొత్త భవన్ నిర్మాణానికి ముందడుగు వేసింది. సుమారు రూ.124.5 కోట్ల వ్యయంతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. దీంతో తెలంగాణ కూడా తన సొంత భవన్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని పలువురు సూచిస్తున్నారు. దేశ రాజధానిలో రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాల్సిన తెలంగాణ భవన్ నిర్మాణం ఇకపై మరింత ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం రాజకీయ వర్గాలు, అధికార యంత్రాంగంలో వ్యక్తమవుతోంది. తెలంగాణకు సొంత చిరునామా కల్పించే ఈ ప్రాజెక్టు త్వరగా కార్యరూపం దాల్చాలనే డిమాండ్ పెరుగుతోంది.



## ఆ నలుగురి మాటలు నమ్మితే అధోగతే

**ఖమ్మం, జూన్ 24:**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని విమర్శించారు. కసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని, ప్రజలు నమ్మవద్దని కోరారు. రెండున్నరేళ్ల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తూ వస్తున్నామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు రూ.22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా కింద వేల కోట్లు, మహిళల ఉచిత బస్సుకు రూ.13వేల కోట్లు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు వోటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. ఈనెల 30న మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నరేళ్ల కాలంలో రైతు భరోసాకు రూ.36 వేల కోట్లు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. 30న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, 'సుడా' చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## హెచ్‌సీఏలో పోరు.. హైకోర్టు ముందుకు అప్పీలు

మొదటిపేజీ తరువాయి

ధర్మాసనం ముందుకు చేరింది. అసోసియేషన్ వ్యవహారాల పర్యవేక్షణకు వన్ మ్యాన్ కమిటీ నియామకం, ఆర్థిక అవకతవకలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పలు క్రికెట్ క్లబ్‌లు అప్పీలు దాఖలు చేశాయి.
ఈ అప్పీళ్లపై బుధవారం విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.హరిప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం హెచ్‌సీఏతో పాటు పిటిషనర్లను సమగ్ర కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

**వన్ మ్యాన్ కమిటీపై అభ్యంతరాలు**

హెచ్‌సీఏలో నిధుల దుర్వినియోగం, ఆర్థిక అక్రమాల ఆరోపణలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి రాష్ట్ర సీఐడీ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు అసోసియేషన్ కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతలను హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.నవీన్ రావుకు అప్పగించారు.
అయితే ఈ నిర్ణయాన్ని ఎస్.ఎ.అంబర్‌పేట్ క్రికెట్ క్లబ్, జిందా తిలిస్మాత్ క్లబ్, సాగర్ క్రికెట్ క్లబ్ సహా పలు క్లబ్‌లు వ్యతిరేకించాయి. ఎన్నికైన పాలకవర్గాన్ని పక్కనబెట్టి పరిపాలనను కోర్టు నియమించిన కమిటీ చేతుల్లోకి ఇవ్వడం చట్టబద్ధం కాదని క్లబ్‌ల తరపు న్యాయవాదులు వాదించారు. కొందరు వ్యక్తుల చర్యలకు మొత్తం కమిటీని బాధ్యులను చేయడం సరికాదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.







**క్లబ్‌లకు ముందే సమాచారం: హెచ్‌సీఏ**

మరోవైపు హెచ్‌సీఏ తరపు న్యాయవాది అప్పీళ్లను వ్యతిరేకించారు. అసోసియేషన్‌లో 150కు పైగా సభ్య క్లబ్‌లు ఉన్నప్పటికీ కేవలం కొద్ది క్లబ్‌లు మాత్రమే కోర్టును ఆశ్రయించాయని తెలిపారు. విచారణల గురించి సభ్య క్లబ్‌లకు ముందుగానే సమాచారం ఉన్నప్పటికీ అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని పేర్కొన్నారు. హెచ్‌సీఏలో పారదర్శకత, ప్రక్షాళన కోసం సింగిల్ జడ్జి తీర్పు అవసరమని వాదించారు.
ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, అసలు పిటిషన్ దాఖలు చేసిన సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్‌ను కూడా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అనంతరం విచారణను జూలై 21కు వాయిదా వేసింది.

**దల్జీత్ సింగ్‌కు తాత్కాలిక బాధ్యతలు**

హెచ్‌సీఏలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారాయి. జూన్ 8న హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అమర్‌నాథ్ నియామకాన్ని హైకోర్టు రద్దు చేసింది. కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరిగే వరకు వైస్ ప్రెసిడెంట్ దల్జీత్ సింగ్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించాలని ఆదేశించింది.
ఇప్పుడు సిట్ దర్యాప్తు, వన్ మ్యాన్ కమిటీ పర్యవేక్షణ అంశాలపై జూలై 21న హైకోర్టు తీసుకునే నిర్ణయం హెచ్‌సీఏ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశముంది. విచారణ నాటికి సంబంధిత అన్ని పత్రాలు, రికార్డులు సమర్పించాలని ఇరుపక్షాలకు ధర్మాసనం సూచించింది.

### ఉత్తర అమెరికాలో తెలుగు సంబరం..

# ఘనంగా మాటా మహాసభలు

**మొదటిపేజీ తరువాయి**

మందికి పైగా తెలుగు కుటుంబాలు హాజరుకావడంతో ఉత్తర అమెరికాలోని అతిపెద్ద తెలుగు సమ్మేళనాల్లో ఒకటిగా ఈ మహాసభలు నిలిచాయి.

సినీ ప్రముఖుల రాకతో మహాసభలు మరింత ఆకర్షణీయంగా మారాయి. నటులు నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్య రాజేష్, జయప్రద, సుమన్, అలీ, విషి అయ్యర్, శివారెడ్డి, అధిరే అభి, సునామి సుధాకర్, మిమిక్రీ రమేష్ తదితరులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ నిర్వహించిన ప్రత్యక్ష సంగీత విభావరి సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గాయకుడు రామ్ మిర్యాల సంగీత ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. మొదటి రోజు కార్యక్రమాలను నిఖిల్ విజయేంద్ర సింహా నిర్వహించగా, రెండో రోజు సుమ కనకాల, ప్రదీప్ మాచిరాజు తమ చురుకైన వ్యాఖ్యానంతో సభను ఉత్సాహభరితంగా మార్చారు.

**జయప్రదకు ప్రత్యేక సత్కారం**

మహాసభల సందర్భంగా ప్రముఖ నటి, మాజీ ఎంపీ జయప్రదకు 'మాటా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' ప్రదానం చేశారు. డాక్టర్ ఎం.ఎస్. రెడ్డి, డాక్టర్ హరినాథ్ పోలిచర్లలకు 'ప్రైడ్ ఆఫ్ ఇండియా' అవార్డులు అందజేశారు.



సమాజ సేవ, వ్యాపారం, కళలు, వైద్యం, సాంకేతిక రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురికి 'మాటా ఎక్సలెన్స్ అవార్డులు' ప్రదానం చేశారు. టీ.పీ. శ్రీనివాస్ రావు, భాస్కర్ గంటి, సాయినాథ్ కర్నాటి, స్వాతి అట్లూరి, దాము గేదల, డా. విజయ్ భాస్కర్ బొల్గం, నాగేశ్వరరావు పూజారి, రాజు చామర్తి, కృష్ణ మద్దిపట్ల తదితరులు అవార్డులు అందుకున్నారు.

**భక్తి, సంస్కృతి, సామరస్యానికి వేదిక**

ప్రధాన మహాసభ హిందూ పూజారి, ఇమామ్, క్రైస్తవ పాస్టర్ల సంయుక్త ప్రార్థనలతో ప్రారంభమై మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. అనంతరం నిర్వహించిన శ్రీ సీతారామ శోభాయాత్ర, భద్రాచల సీతారామ కళ్యాణ మహోత్సవం, పట్టాభిషేక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తెలుగు, భారతీయ, అంతర్జాతీయ వంటకాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు సందర్శకులను మెప్పించింది. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నాయకత్వం, వ్యాపారం, కృత్రిమ మేధస్సు, మహిళా సాధికారత, వైద్యం, న్యాయ, రాజకీయ, సాహిత్య రంగాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. 'మాటా సింగింగ్ స్టార్' పోటీల్లో ఉత్తర అమెరికా నలుమూలల నుంచి 300 మందికి పైగా గాయకులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

**విజయవంతంగా నిర్వహించిన నిర్వాహక బృందం**

మాటా అధ్యక్షుడు రమణ కిరణ్ దుద్దగి, కన్వీనర్ శ్రీధర్ గూడల ఆధ్వర్యంలో ఈ మహాసభలు విజయవంతంగా జరిగాయి. వ్యవస్థాపకులు శ్రీనివాస్ గణగోని, ప్రదీప్ సామల, జితేందర్ రెడ్డి మార్గదర్శకత్వం అందించారు. మహాసభల విజయానికి టోనీ జన్ను, దాము గేదల, ప్రవీణ్ గుడూరు, విజయ్ భాస్కర్ కలాల్, కళ్యాణి బెల్లంకొండ, నాగేశ్ చిలకపాటి, మహేందర్ నారాల, శిరీష గుండపునేని, స్వాతి అట్లూరి, శ్రీధర్ పెంట్యాల, డా. విజయ్ భాస్కర్ బొల్గం, ప్రశాంత్ శ్రీపెరంబుదూరు, సురేష్ ఖాజానా తదితరులు విశేష కృషి చేశారు. సేవ, సంస్కృతి, సమానత్వం అనే నినాదంతో నిర్వహించిన ఈ మహాసభలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల ఐక్యత, ఆత్మీయత, సాంస్కృతిక వారసత్వాన్ని మరోసారి ప్రతిబింబించాయి.

## కమ్యూనిజానికే భవిష్యత్తు: కూనంనేని

**హైదరాబాద్, జూన్ 24:**



ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం సంక్షోభాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కమ్యూనిస్టు భావజాలానికి ఆదరణ పెరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నాగోల్‌లోని గిరి ప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సూర్యాపేట జిల్లా సమితి సభ్యుల రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆకలి సమస్యలు పెరుగుతున్నాయని, ధనికపేదల మధ్య అంతరం మరింత విస్తరిస్తోందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు కొద్దిమంది కార్పొరేట్ సంస్థల సంపద భారీగా పెరుగుతుండగా, సాధారణ ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ అప్పులు కూడా గణనీయంగా పెరిగాయని ఆయన విమర్శించారు.

**ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారం**

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్య ప్రజల జీవన వ్యయాన్ని అధికం చేస్తున్నాయని కూనంనేని అన్నారు. ఆర్థిక అసమానతలతో పాటు మహిళలు, మైనారిటీలు, దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో అణగారిన వర్గాలు, కార్మికులు, రైతులు, యువత ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు చూస్తున్నారని చెప్పారు.

**ప్రపంచంలో వామపక్షాల ఎదుగుదల**

ప్రపంచంలోని పలు దేశాల్లో వామపక్ష, సోషలిస్టు భావజాలానికి మద్దతు పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. శ్రీలంక, నేపాల్, చైనా వంటి దేశాల ఉదాహరణలను ప్రస్తావిస్తూ కమ్యూనిస్టు శక్తులు పలు ప్రాంతాల్లో ప్రభావాన్ని విస్తరించుకుంటున్నాయని తెలిపారు. ప్రపంచ రాజకీయ పరిణామాలు కూడా సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాల చుట్టూ తిరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు.

**కమ్యూనిస్టుల ఐక్యత అవసరం**

భారతదేశంలో కమ్యూనిస్టు శక్తులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని కూనంనేని పిలుపునిచ్చారు. ఎన్నో నిర్బంధాలు, సవాళ్లను ఎదుర్కొంటూ సీపీఐ పార్టీ శతాబ్దకాలంగా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తోందని అన్నారు. భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భాగం హేమంతరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ కు హైకోర్టులో ఊరట

**మొదటిపేజీ తరువాయి**

హుజూరాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నిక సమ యంలో కాంగ్రెస్ పార్టీ తరపున నాడు ఎంపీ, పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్ రెడ్డి కమలాపూర్ లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో కోవిడ్19 నిబంధనలను ఉల్లంఘించి, అనుమతించిన దానికంటే ఎక్కువమందితో సభ నిర్వహించారనే ఆరోపణలతో కమలాపూర్ పోలీసులు ఆయనపై ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టులో సుదీర్ఘంగా విచారణ జరిగింది. రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది తమ వాదనలు వినిపిస్తూ ప్రచార సమయంలో తన క్లయింట్ అన్ని రకాల జాగ్రత్తలు పాటించారని, రాజకీయంగా ఇబ్బందులకు గురిచేయాలనే దురుద్దేశంతోనే నాటి ప్రభుత్వం ఈ కేసులను నమోదు చేయించిందని కోర్టుకు వివరించారు. వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యా యస్థానం, సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి తప్పూ చేయలేదని స్పష్టం చేస్తూ ఆయనపై ఉన్న కేసును కొట్టేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

## యూరియా ఇవ్వకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు ధర్నా: పొన్నం

**హైదరాబాద్, జూన్ 24:**

తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి తగినంత యూరియా కేటాయించకపోతే బీజేపీ నాయకుల ఇళ్ల ముందు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణకు అవసరమైన ఎరువుల సరఫరా కోసం బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

గాంధీ భవన్‌లో నిర్వహించిన "మంత్రితో ముఖాముఖీ" కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యూరియా సరఫరా బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని, కేంద్రం కేటాయించిన మేరకే రాష్ట్రాలు పంపిణీ చేస్తాయని తెలిపారు.

**కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి**

తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరా అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని పొన్నం ప్రభాకర్ చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం లేకపోవడం వల్ల కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపించారు. అవసరమైతే కేంద్రంలోని ఏ మంత్రినైనా కలిసి రాష్ట్ర అవసరాలను వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులను తెలంగాణకు పూర్తి స్థాయిలో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరతకు రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యులను చేస్తూ జరుగుతున్న ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**త్వరలో కొత్త పెన్షన్ల మంజూరు**

గతంలో రేషన్ కార్డుల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని మంత్రి పేర్కొన్నారు. భూ సమస్యలు, కొత్త పెన్షన్ల కోసం మాత్రమే ఎక్కువగా వినతులు అందుతున్నాయని చెప్పారు.

ప్రభుత్వం ఇప్పటికే రెండు లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేసిందని, త్వరలోనే అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించామని చెప్పారు.

**సంక్షేమ పథకాల అమలు**

రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తోందని మంత్రి వివరించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 29 నుంచి ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల పంపిణీ నిరంతరంగా కొనసాగుతుందని చెప్పారు

## వ్యాపారులకు టీజీఎస్ఆర్టీసీ గోల్డెన్ ఛాన్స్

**హైదరాబాద్, జూన్ 24:**



"ఆర్టీసీ స్థలాల్లో షాపుల కేటాయింపు ప్రక్రియను మరింత సరళతరం చేశాం. వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపారాభివృద్ధితో పాటు సంస్థ ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి అన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థకు అదనపు ఆదాయం సమకూర్చే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్‌లలోని దుకాణాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు సిద్ధమైంది.

ఆర్టీసీ బస్టాండ్లు, వ్యాపార సముదాయాలు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. దీంతో హోటళ్లు, ఆహార కేంద్రాలు, సూపర్ మార్కెట్లు, వస్త్ర దుకాణాలు, బ్రాండెడ్ షోరూమ్‌లు, ఇతర వ్యాపార సంస్థలకు ఇవి అనుకూల కేంద్రాలుగా మారనున్నాయి. కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి, ఇప్పటికే ఉన్న వ్యాపారాలను విస్తరించాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా నిలవనుంది.

**694 షాపులకు టెండర్లు**

రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, డిపోల పరిధిలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 694 షాపులకు త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. పారదర్శక విధానంలో లీజు ప్రక్రియ చేపట్టి వ్యాపారులకు అవకాశం కల్పించనుంది. ఈ ప్రక్రియలో పారదర్శకత పెంచేందుకు సంస్థ పరిధిలోని అన్ని కమర్షియల్ కాంప్లెక్స్‌ల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఏ ప్రాంతంలో ఎన్ని దుకాణాలు ఉన్నాయి, అవి ఖాళీగా ఉన్నాయా, ప్రస్తుతం ఎవరికి కేటాయించబడ్డాయి, లీజు కాలపరిమితి, అద్దె వివరాలు వంటి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచారు.

దళారీ వ్యవస్థకు చెక్ పెట్టడంతో పాటు డిజిటల్ జవాబుదారీతనాన్ని పెంచే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**వ్యాపార రంగానికి ఊతం**

ఈ నిర్ణయం ద్వారా టీజీఎస్ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరడమే కాకుండా స్థానిక యువత, వ్యాపారవేత్తలకు కొత్త అవకాశాలు లభించనున్నాయి. పారదర్శక విధానంలో వ్యాపార స్థలాల కేటాయింపు ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్టీసీ అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకుని వ్యాపారంలో ముందుకు సాగాలని సంస్థ యాజమాన్యం వ్యాపార వర్గాలకు పిలుపునిచ్చింది.

## అక్రమ సెక్యూరిటీ ఏజెన్సీలపై ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి**

నోటీసులు జారీ చేశారు. అయితే సంబంధిత ఏజెన్సీల నిర్వాహకులు ఎలాంటి వివరణ ఇవ్వకపోవడంతో చట్టపరమైన చర్యలు చేపట్టారు. కరీంనగర్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్ష**

ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు తప్పనిసరిగా పీఎస్ఏఆర్ఏ లైసెన్స్ కలిగి ఉండాలని ఓఎస్డీ కమలాసన్ రెడ్డి తెలిపారు. లైసెన్స్ లేకుండా సంస్థలు నిర్వహించడం నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులకు ఏడాది వరకు జైలు శిక్ష లేదా రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.

భద్రతా సిబ్బంది నియామకంలో కూడా నిర్దిష్ట నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతి సెక్యూరిటీ గార్డుకు పోలీస్ వెరిఫికేషన్ నిర్వహించడంతో పాటు కనీసం 21 రోజుల ప్రాథమిక శిక్షణ ఇచ్చిన తర్వాతే విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్**

అక్రమ సెక్యూరిటీ ఏజెన్సీల గుర్తింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని జిల్లాల్లో నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న సంస్థలపై చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**యజమానులకు పోలీసుల హెచ్చరిక**

వ్యాపార, పారిశ్రామిక సంస్థల యజమానులు భద్రతా సిబ్బందిని నియమించుకునే ముందు ఆయా ఏజెన్సీలకు చెల్లుబాటు అయ్యే పీఎస్ఏఆర్ఏ లైసెన్స్ ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని ఏడీజీ విజయ్ కుమార్ సూచించారు. లైసెన్స్ లేని సంస్థల సేవలు వినియోగించడం వల్ల భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. గుర్తింపు పొందిన, చట్టబద్ధంగా అనుమతులు కలిగిన ఏజెన్సీలకే భద్రతా బాధ్యతలు అప్పగించాలని సూచించారు

## బాల్క సుమన్‌కు బెయిల్

- **రూ.25 వేల వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తుతో మంజూరు**
- **సింగరేణి వ్యాఖ్యల కేసులో 25 రోజులుగా జైలులో మాజీ ఎమ్మెల్యే**

**హైదరాబాద్, జూన్ 24:**

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఇద్దరి పూచీకత్తు సమర్పించాలనే షరతుతో బెయిల్ ఇచ్చింది. సింగరేణికి సంబంధించిన వ్యాఖ్యల కేసులో బాల్క సుమన్‌ను గత నెల 29న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ నేతల సమావేశంలో మాట్లాడిన ఆయన, నిరసన కార్యక్రమాల సందర్భంగా కార్యకర్తలు రోడ్లపైకి రావాలని, అవసరమైతే మిలిటెంట్ తరహాలో ఆందోళనలు చేపట్టాలని చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. సింగరేణి కార్యాలయాలపై దాడులు చేయాలని, అద్దాలు ధ్వంసం చేయాలని పిలుపునిచ్చారంటూ కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు పలు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అనంతరం అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను కోర్టు ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. గత 25 రోజులుగా ఆయన జైలులోనే ఉన్నారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, నిర్దిష్ట షరతులతో బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బాల్క సుమన్ విడుదలకు మార్గం సుగమమైంది.



## కరీంనగర్‌లో మళ్లీ కారు సునామీ ఖాయం: కేటీఆర్

- **బీఆర్ఎస్‌కు ప్రజల్లో మద్దతు పెరుగుతోందని వ్యాఖ్య**
- **కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**
- **బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచన**

**కరీంనగర్, జూన్ 24:**

"పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేలో కరీంనగర్ జిల్లాలో కారు గుర్తు మరోసారి సునామీ సృష్టించబోతున్నట్లు తేలింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ సమావేశమయ్యారు. పార్టీ కార్యక్రమాలు, సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చించి దిశానిర్దేశం చేశారు.

అనంతరం మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా మొదటి నుంచి బీఆర్ఎస్‌కు బలమైన కోటగా నిలిచిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ప్రచారాల కారణంగా కొన్ని స్థానాలను కోల్పోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో నిరాశ పెరిగిందని, ఇప్పుడు మళ్లీ ప్రజలు కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారని అన్నారు.

సింగరేణికి సంబంధించి కాంగ్రెస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్రలు, అవినీతి వ్యవహారాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. కార్మిక వర్గాల్లో అవగాహన పెంచి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు.

పార్టీ నిర్మాణాన్ని గ్రామస్థాయికే పరిమితం చేయకుండా బూత్ స్థాయి వరకు బలోపేతం చేయాలని కేటీఆర్ సూచించారు. ప్రతి బూత్‌లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. అధికారం ఉన్నా లేకపోయినా కార్యకర్తలను గౌరవించడం పార్టీ బాధ్యత అని చెప్పారు.



కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతను ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వర్షాలు ఆలస్యమైనా కాళేశ్వరం ద్వారా నీరు అందుబాటులో ఉందని, అయినప్పటికీ రైతులకు నీటిని సమర్థంగా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. రైతులకు అవసరమైన సమయంలో నీటిని ఎత్తిపోసి అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడుతున్న తీరును ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

సామాజిక మాధ్యమాల ప్రాధాన్యతను అర్థం చేసుకుని వాటిని సమర్థంగా వినియోగించాలని కేటీఆర్ కోరారు. మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. సమావేశంలో సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలు, నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితులపై కేటీఆర్ ఆరా తీశారు. పార్టీ బలోపేతానికి సంబంధించిన కార్యాచరణపై నాయకులకు పలు సూచనలు చేశారు.



# అయోధ్య రామయ్యా.. ఏమిటీ అపచారం!

అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకలను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు. అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు. అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యాయన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగుడగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు పక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది. ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

# ఇరాన్‌కు ఎలాంటి డబ్బూ ఇవ్వడం లేదు: ట్రంప్

- ఆస్తుల విడుదల ప్రశ్నే లేదు.. అవసరమైతే ఆహారం అందిస్తాం
- అణు కేంద్రాల తనిఖీలకు అనుమతి లేదన్న ఇరాన్



**న్యూయార్క్/టెహ్రాన్, జూన్ 24:** ఇరాన్‌కు అమెరికా ఎలాంటి ఆర్థిక సాయం అందించడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌కు చెందిన ఆస్తులను విడుదల చేసే ఆలోచన కూడా తమకు లేదని తేల్చిచెప్పారు. అవసరమైతే మానవతా దృక్పథంతో ఆహారం కొనుగోలు చేసి అందించగలమని పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై ఎలాంటి టోల్ ఛార్జీలు లేవని, నౌకాయానానికి ఇరాన్ అంగీకరించిందని తెలిపారు. మంగళవారం తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ చేసిన పోస్టు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇరాన్‌కు సంబంధించిన నిధుల విషయంలో అమెరికా వైఖరిని ఆయన స్పష్టంచేశారు. ఆంక్షల సడలింపుల నేపథ్యంలో అన్‌ఫ్రీజ్ అయ్యే లేదా అమెరికా ట్రెజరీ ద్వారా విడుదలయ్యే నిధులు నేరుగా ఇరాన్ ప్రభుత్వానికి వెళ్లవని తెలిపారు. ఆ నిధులన్నీ అమెరికా నియంత్రణలో ఉండే ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లోనే కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇరాన్ ఆ నిధులను కూడా పూర్తిస్థాయిలో స్వేచ్ఛగా వినియోగించుకోలేదని ట్రంప్ వెల్లడించారు. ఆహారం, ఔషధాలు, వైద్య సామగ్రి వంటి మానవతా అవసరాల కోసం మాత్రమే ఆ మొత్తాలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అమెరికా జాతీయ భద్రతకు విఘాతం కలిగించేలా ఎలాంటి నిధులు విడుదలయ్యే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఇరాన్ అణు కేంద్రాల తనిఖీలపై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. టెహ్రాన్‌లో అణు తనిఖీలు చేపట్టనున్నట్లు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) ప్రధాన అధికారి రఫాయెల్ గ్రోసీ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా దెబ్బతిన్న తమ అత్యంత సున్నితమైన అణు కేంద్రాలు, అణు పదార్థాల నిల్వ ప్రాంతాలను పరిశీలించేందుకు ఐఏఈఏకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెం ఘరీబాబాది స్పష్టం చేశారు. దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని ఆయన పేర్కొన్నారు.

### మళ్లీ తెరపైకి అణు వివాదం

ఇరాన్ అణు కార్యక్రమంపై ఇప్పటికే అమెరికా, పాశ్చాత్య దేశాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఇరాన్ వాదిస్తోంది. అయితే తాజా పరిణామాలతో అణు తనిఖీల అంశం మరోసారి అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇరాన్‌కు నిధుల విడుదల, అణు కేంద్రాల తనిఖీలు, హోర్ముజ్ జలసంధి భద్రత వంటి అంశాలపై అమెరికా-ఇరాన్ మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో పరిస్థితులు ఎలా మారతాయన్న దానిపై అంతర్జాతీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# ఎస్ఐఆర్ జాబితాలో పేరు లేకుంటే రేషన్ ఇవ్వరా?

**పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ప్రశ్నలు**
**ముందు హైకోర్టును ఆశ్రయించండిద**
**పిటిషనర్‌కు సూచన**




**న్యూఢిల్లీ, జూన్ 24 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో పేరు తొలగించబడిన వారికి రేషన్ సరఫరా నిలిపివేస్తున్నారంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే రేషన్ ఇవ్వరా?" అంటూ అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పరిపాలనా నిర్ణయాలకు సంబంధించిన ప్రత్యేక అంశమని అభిప్రాయపడిన సుప్రీంకోర్టు, రాజ్యాంగంలోని ఆర్టికల్-32 కింద నేరుగా తమను ఆశ్రయించడం కంటే ముందుగా సంబంధిత హైకోర్టును సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, పిటిషనర్‌కు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకునే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రేషన్ నిరాకరణకు సంబంధించిన వివాదంపై కోల్‌కతా హైకోర్టులో తగిన న్యాయపరమైన పరిహారం కోరవచ్చని పేర్కొంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో పేరు లేకపోవడాన్ని ఆధారంగా చేసుకుని రేషన్ వంటి సంక్షేమ పథకాల లబ్ధిని నిరాకరించడం సరైందేనా అనే అంశంపై న్యాయ, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై కోల్‌కతా హైకోర్టు ముందు విచారణ జరిగే అవకాశం ఉండటంతో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

# ఆ ఆగ్రహంతోనే కాక్రోచ్ ఉద్యమం..

- విద్యార్థుల సమస్యలపై పోరాటం కొనసాగుతుంది
- జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూన్ 24 :** నీట్ పరీక్ష వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసిన "కాక్రోచ్ ఉద్యమం" వెనుక యువతలో పెరుగుతున్న అసంతృప్తి, ఆగ్రహమే ప్రధాన కారణమై ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన జైరాం రమేష్, ఈ ఉద్యమం ఆవిర్భావంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. కొందరు దీనిని "డీప్ స్టేట్" ప్రాయోజిత ఉద్యమంగా అభివర్ణిస్తుంటే, మరికొందరు యువతలో పేరుకుపోతున్న నిరాశ, అసంతృప్తికి ఇది ప్రతిబింబమని భావిస్తున్నారని చెప్పారు. "కాక్రోచ్ ఉద్యమం ఎలా ప్రారంభమైందనే విషయంలో భిన్న వాదనలు ఉన్నాయి. కొందరు దీనిని వ్యవస్థీకృతంగా నడిపిస్తున్న ఉద్యమమని అంటున్నారు. మరికొందరు యువతలోని ఆగ్రహం, నిరాశకు ఇది ప్రతిబింబమని చెబుతున్నారు. ఈ రెండు వాదనల్లో ఏది నిజమో నిర్ధారించడం కష్టం. అయితే ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందన్నది వాస్తవం" అని జైరాం రమేష్ పేర్కొన్నారు. కాక్రోచ్ ఉద్యమం ఒక రాజకీయ పార్టీ కాదని, ప్రజాస్వామ్యంలో చివరకు రాజకీయ పార్టీలే సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. యువత అసంతృప్తిని వెలుగులోకి తీసుకురావడంలో ఈ ఉద్యమం ఒక వేదికగా పనిచేసిందని, అయితే ఆ సమస్యలను పరిష్కార దిశగా తీసుకెళ్లాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదేనని అన్నారు.

### విద్యార్థులతో రాహుల్ మమేకం

విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జైరాం రమేష్ తెలిపారు. ఇటీవల రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థులతో సమావేశమైన రాహుల్ గాంధీ, త్వరలో ప్రయాగ్‌రాజ్, పాట్నా, ఢిల్లీ నగరాల్లో కూడా విద్యార్థులతో చర్చలు జరపనున్నారని వెల్లడించారు. రాహుల్ గాంధీ కేవలం నీట్ లేదా ఇతర పరీక్షల వివాదాలకే పరిమితం కావడం లేదని, దేశ విద్యా



వ్యవస్థ ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను లేవనెత్తుతున్నారని జైరాం రమేష్ అన్నారు. పరీక్షల నిర్వహణ, విద్యా విధానం, ప్రభుత్వ పెట్టుబడులు, కోచింగ్ వ్యవస్థ ప్రభావం వంటి అంశాలపై సమగ్ర చర్చ అవసరమన్నారు. కోటాలో విద్యా ర్థులతో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, భారత కుటుంబాలు కోచింగ్ కేంద్రాలపై ఖర్చు చేస్తున్న మొత్తంతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వం విద్యపై తక్కువగా ఖర్చు చేస్తోందని ఆయన పేర్కొన్నారని జైరాం రమేష్ గుర్తుచేశారు. ఇది దేశ విద్యా వ్యవస్థలో ఉన్న అసమతుల్యతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలు, పరీక్షల పారదర్శకత, విద్యా సంస్కరణలపై కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు.

# ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఇరాన్ ఆహ్వానం

- జులై 4 నుంచి 9 వరకు కార్యక్రమాలు
- ప్రధాని హాజరుపై ఇంకా స్పష్టత లేదు



**న్యూఢిల్లీ/టెహ్రాన్, జూన్ 24 :** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అధికారిక ఆహ్వానం పంపినట్లు దౌత్య వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఖమేనీ మరణించిన అనంతరం వాయిదా పడిన అంత్యక్రియలను వచ్చే నెల ఘనంగా నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న టెహ్రాన్‌లో ప్రారంభమై, జులై 9న ఆయన స్వస్థలమైన మషాద్‌లో ఖననంతో ముగియనున్నాయని ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది. టెహ్రాన్, ఖోమ్, మషాద్ నగరాల్లో పలు దశల్లో సంతాప సభలు, అంతిమ యాత్రలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు వివిధ దేశాల అధినేతలు, ప్రభుత్వ ప్రతినిధులు, దౌత్య బృందాలను ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. భారత్‌తో ఇరాన్‌కు ఉన్న సుదీర్ఘ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాల దృష్ట్యా ప్రధాని మోదీకి ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.

### మోదీ వెళ్తారా..? ప్రతినిధి బృందమా..?

ఇరాన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై భారత ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా అంత్యక్రియలకు హాజరవుతారా, లేక భారత తరఫున ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపుతారా అన్న అంశంపై దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### భారత్-ఇరాన్ సంబంధాలకు ప్రాధాన్యం

భారత్, ఇరాన్ మధ్య ఇంధన భద్రత, వాణిజ్యం, చాబహార్ నౌకాశ్రయం అభివృద్ధి, ప్రాంతీయ భద్రత వంటి అంశాల్లో కీలక సహకారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఖమేనీ అంత్యక్రియల్లో భారత ప్రాతినిధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రెండు దేశాల దౌత్య సంబంధాల పరంగా కూడా కీలకంగా మారే అవకాశం ఉంది. ఇరాన్ అధికారిక ప్రకటన ప్రకారం జులై 4న టెహ్రాన్‌లో వీడ్కోలు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఖోమ్‌లో ప్రత్యేక సంతాప కార్యక్రమాలు నిర్వహించి, జులై 9న మషాద్‌లోని ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రం సమీపంలో ఖమేనీ భౌతికకాయాన్ని ఖననం చేయనున్నారు.

## కాకతీయ ప్రభుత్వ కళాశాలలో టీజీఈఏపీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్)లో టీజీ ఈఏపీసెట్–2026 సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్కు ఆప్షన్ ఇచ్చిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ కేంద్రం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కేంద్రంలో అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో విద్యార్థులకు ఏవైనా సమస్యలు తలెత్తితే వెరిఫికేషన్ ఆఫీసర్లు ఎం.రవి కుమార్, డాక్టర్ యు.స్వామిలను సంప్రదించాలని సూచించారు. కేంద్రంలో డాక్టర్ డి.సమ్మయ్య, డాక్టర్ ఎస్.కిరణ్, డాక్టర్ బి.రమేష్, డాక్టర్ రాజకుమార్ తదితరులు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బత్తిని శ్రీవర్షిత, శ్రీ దీక్షిత్లకు సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తమ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని కోరారు.

## ఎస్ఐఆర్ సర్వేపై బీఎల్ఓలకు శిక్షణ



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 నుంచి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేను విజయవంతంగా చేపట్టేందుకు బుధవారం తాండూర్ తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్ఓలు) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. సర్వే నిర్వహణలో పాటించాల్సిన విధివిధానాలు, నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జె.కల్పన, ఆర్ఐలు బి.పద్మజ, టి.మురళీధర్ రావు, తాండూర్ మండలంలోని బీఎల్ఓలు పాల్గొన్నారు.

## శివాజీ నగర్లో డ్రైనేజీ పనులకు భూమి పూజ



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శివాజీ నగర్ 11వ వార్డులో గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు బుధవారం ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మురుగునీటి సమస్య పరిష్కారానికి డ్రైనేజీ నిర్మాణం దోహదపడుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామపంచాయతీ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు సభ్యులు ఉప్పట్ల దుర్గా చరణ్, 9వ వార్డు సభ్యులు సింగారపు శ్రీధర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ షబ్బీర్ను పరామర్శించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామ ఉప సర్పంచ్ షబ్బీర్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. కోలుకుని ఇస్లాం నగర్లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ జాదవ్ బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా షబ్బీర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరింత చురుకుగా కొనసాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్, గ్రామస్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమం దిశగా ప్రభుత్వం కృషి

- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమ అందించగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో గిరిజన ప్రజల ఆరోగ్య ఫలితాల మెరుగుదల అంశంపై నిర్వహించిన సమావేశానికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సమావేశానికి ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు హాజరై ఉట్నూర్ పరిధిలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రజల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో తలెత్తిన లోపాలు, ఆరోగ్య ఫలితాల మెరుగుదల అంశాలపై సమావేశంలో చర్చించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గిరిజన గూడాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణపై సూచించడం జరిగిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి గిరిజన ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను అధికారుల సమన్వయంతో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన గిరిజన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, విద్య, వైద్య రంగాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించేలా రహదారుల అనుసంధానం, గిరిజన పిల్లల ఆరోగ్యం దృష్ట్యా పోషణ్ అభియాన్ అమలు, ప్రధానమంత్రి జుగా, జన్ మన్ ఇతర అనేక కార్యక్రమాల అమలుపై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సమగ్ర గిరిజన అభివృద్ధి



అధికారి రాహుల్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం





- నేరడిగొండ పీహెచ్సీని తనిఖీ చేసిన జిల్లా స్పెషల్ కలెక్టర్ రాజీవ్ హన్మంతు

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ కలెక్టర్ రాజీవ్ హన్మంతు అన్నారు. నేరడిగొండ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలతో పాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్పీవీ టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీకాల పంపిణీ విధానం, లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధుల నివారణలో టీకా కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని, అర్హులైన ప్రతిఒక్కరికీ టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రజల్లో టీకాలపై అవగాహన పెంచాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పల్స్ పోలియోతో పాటు సాధారణ రోగనిరోధక టీకాల కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించి ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహశీల్దార్ ఎంఏ కలీమ్, పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సద్దాం, హెచ్ఈఓ పవార్ రవీందర్, హెల్త్ సూపర్వైజర్లు సంతోష్, స్వర్ణలత, అసిస్టెంట్ బాపుజీ, ఫార్మసిస్ట్ అరుణ్ కుమార్, ఏఎన్ఎం పవార్ అమ్మిబాయి, ఆశా కార్యకర్త జయమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్రీ ప్రైమరీ విద్యను అమలు చేయాలని

- ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున
- విద్యార్థులకు ఉచిత నోట్బుక్స్ పంపిణీ



**ఉద్యమ కెరటం, వరంగల్:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్రీ ప్రైమరీ విద్యను అమలు చేయాలని ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్డీఎస్) ఆధ్వర్యంలో బుధవారం కాట్రపల్లి ప్రభుత్వ పా ఠశాలలో విద్యార్థులకు 150 నోట్బుక్స్, 20 పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టులకే పరిమితం కాకుండా అన్ని పాఠశాలలకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, నాన్–టీచింగ్ సిబ్బంది, డీఈఓ, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎఫ్డీఎస్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు గ్రామస్తులు ఐక్యంగా ముందుకు వచ్చి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాసంస్థలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరభద్రయ్య, గడ్డం బాలకృష్ణ, గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# జిల్లా లోని ఎస్సీ న్యాయ శాస్త్ర పట్ట భద్రులు దరఖాస్తు చేసుకోవాలి

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ ద్వారా 2025–26 సంవత్సరానికి జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల చెందిన న్యాయ శాస్త్ర పట్ట భద్రులు శిక్షణ భృతి, న్యాయ శాస్త్ర గ్రంథాలు, ఫర్నిచర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 39 సంవత్సరాల లోపు న్యాయ శాస్త్ర పట్ట భద్రులకు మూడు సంవత్సరాల పాటు న్యాయ పరిపాలనలో శిక్షణ నిమిత్తం జిల్లాలోని లా అధికారులకు అటాచ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.3వేల చొప్పున శిక్షణ భృతి, న్యాయ శాస్త్ర గ్రంధాలు, ఫర్నిచర్ కొనుగోలు నిమిత్తం ఒకసారి రూ.50వేలు అందించడం




జరుగుతుందని తెలిపారు. అర్హత గల న్యాయ శాస్త్ర పట్ట భద్రులు ఆన్ లైన్ లో EPASS–https://Telanganaepass.cgg.gov.in లో జూలై 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు భారత్ అసోసియేషన్ లో సభ్యులుగా ఉండాలని, సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంత వాసులకు రూ.1లక్ష 50వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల ఆదాయం ఉన్నట్లు మీ –సేవా ద్వారా జారీ చేయబడిన ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తులను సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా షెడ్యూల్డ్ కులాల శాఖ కార్యాలయంలో సమర్పించాలని, ఇతర వివరాలకు కార్యాలయ సంప్రదించాలని కోరారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి





- రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఈఎన్టీ, యూరాలజీ, డ్రగ్స్ స్టోర్, ఈసీజీ తదితర విభాగాలను సందర్శించి ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, ఎక్స్రే, ఈసీజీ పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రిలో న్యూరో సర్జరీ, యూరాలజీ, సైకియాట్రీ, ఈఎన్టీ వంటి ఖరీదైన స్పెషలిస్ట్ సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు భరించకుండా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, రోగులు, వారి సహాయకుల్లో అవగాహన కల్పించేందుకు ఆడియో సందేశాలు ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీలో కొన్ని చిన్నపాటి లోపాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రొఫెసర్లు, హెచ్ఓడీలు విధుల్లో తప్పనిసరిగా హాజరు కావాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఎంఓను హెచ్చరించారు. రోగులకు అవసరమైన మందులు ఎలాంటి కొరత లేకుండా సీడీఎస్, ప్రైవేట్ టెండర్ల ద్వారా కొనుగోలు చేసి ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్య సేవలకు సంబంధించిన సమస్యలు ఉంటే నేరుగా రిమ్స్ డైరెక్టర్, లేనియెడల తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వర్షాకాలంలో పీడియాట్రిక్, ఓబీజీ సేవలు కీలకమైన నేపథ్యంలో హాస్పిటల్ నిధులతో తాత్కాలిక ప్రాతిపదికన వైద్యులను నియమించినట్లు వివరించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ తనిఖీలో ఆర్ఎంఓ చంపత్రావు, పర్యవేక్షకులు నరేందర్, వైద్యులు రాహుల్ పుష్కర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో రాజకీయ పార్టీల సహకారం కీలకం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఈనెల 25 నుంచి జిల్లా లో ప్రారంభం కానున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు నమోదు కావడంతో పాటు, అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని పేర్కొన్నారు. జూలై 24 వరకు నిర్వహించే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో బీఎల్ఓలు ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను బీఎల్ఓలు తిరిగి సేకరించి, అందులోని వివరాలను నిరంతరం యాప్లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పాల్గొని, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించడంతో పాటు ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు, అభ్యంతరాలు, లోపాలు తలెత్తకుండా రాజకీయ పార్టీలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని తహశీల్దార్లు, సూపర్వైజర్లు, ఎన్నికల అధికారులు, జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరుకు తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్మాణాత్మక సూచనలు అందించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వరరావు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన సౌకర్యాల కోసం మార్కెట్ సముదాయం

- జిల్లా కలెక్టర్ కె.హరిత
- రూ.1.25 కోట్లతో నిర్మించిన మార్కెట్ కమిటీ భవనాల ప్రారంభం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవన సముదాయం రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు మార్కెట్ కమిటీకి స్థిరమైన ఆదాయ వనరుగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జైనూర్ మండల కేంద్రంలో రూ.1.25 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, 12 గదుల భవనాల సముదాయాలను ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కోవలక్ష్మి , వెడ్మ బొజ్జు పటేల్ల తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజారి కులకర్ణి పండిత్ మహారాజ్ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన మార్కెట్ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ కార్యాలయంతో పాటు 12 గదుల భవన సముదాయాల నిర్మాణంతో మార్కెట్ కమిటీకి స్థిరమైన ఆదాయం సమకూరుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా ఒరిజినల్ రశీదులు తీసుకుని పంట చేతికి వచ్చే వరకు భద్రపర్చుకోవాలని కోరారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు అత్రం సుగుణ, సర్పంచ్ కొడప ప్రకాశ్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ రావు, వైస్ చైర్మన్ బానోత్ జైవంత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ ముఖిద్, ఆత్మ చైర్మన్ రాథోడ్ రమేష్, జైనూర్, సిర్పూర్(యు) సహకార సంఘాల చైర్మన్లు కొడప హన్నుపటేల్, కేంద్రే శివాజీ, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్, ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ ఆడ బిర్షవ్, ఎంపీఓ శశికుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, ఈజీఎస్ ఏపీఓ నగేష్తో పాటు జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, ఉట్నూర్ మండలాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.



# సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి





**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, జైనూర్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయ ఉద్యోగుల హాజరు నమోదు, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి చేపట్టనున్న సర్ ఇంటింటి కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. సర్వే పత్రాలను పంచాయతీల వారీగా, పోలింగ్ కేంద్రాల వారీగా పంపిణీ చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో నూతన పాస్పోర్ట్ సైజు ఫొటోలు పొందుపర్చేందుకు ఫొటోగ్రాఫర్లతో సమన్వయం చేసుకుని గ్రామాల్లో తక్కువ ధరకు ఫొటోలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్కు సూచించారు. బీఎల్ఓలు ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేస్తారని, ఓటర్లు వాటిని పూర్తి చేసి తిరిగి బీఎల్ఓలకు అందజేయాలని తెలిపారు. అనంతరం బీఎల్ఓలు ఫారాల్లోని వివరాలను యాప్లో నమోదు చేస్తారని చెప్పారు. తహశీల్దార్లు, సూపర్వైజర్లు , జిల్లా యంత్రాంగం మొత్తం సమగ్ర సవరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ తహశీల్దార్ ఆడ బీర్షావ్, ఆర్ఐ మోహన్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు ల స్వీకరణ

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** 2026–27 విద్యా సంవత్సరానికి గాను కరీంనగర్లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, తెలుగు మీడియంలో 10వ తరగతికి ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వయస్సు 6 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉండాలని, ఉత్తర తెలంగాణ ప్రాంతానికి చెందిన అంధ బాలబాలికలు అర్హులని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, పాదరక్షలు, వసతి గృహ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు సదరం, లేనియెడల యూడీఐడీ దివ్యాంగ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బదిలీ సర్టిఫికెట్, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో కరీంనగర్లోని విజయపురి కాలనీ, మల్కాపూర్ రోడ్డులో గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్: 9701190127, 9440338424 నంబర్ల లో సంప్రదించాలని వివరించారు.

# పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూరిత చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐఐఐటీ సీటుతో సాధించడం గ్రామానికే గర్వకారణం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఐఐఐటీలో సీటు సాధించి ఉన్నత విద్యాభ్యాసం వైపు అడుగులు వేస్తున్న వైష్ణవి గ్రామానికే గర్వకారణంగా నిలిచిందని వదూర్ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆమె ప్రతిభను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కష్టపడి చదివితే లక్ష్యాలను సాధించడం సాధ్యమేనని, వైష్ణవి సాధించిన విజయం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదే విధంగా పదవ తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని ప్రవళికను సైతం ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యార్థుల విజయాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఊషన్న, లక్ష్మణ్, షోయబ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినికి ట్రిపుల్ ఐటీ లో సీటు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ జెడ్పీహెచ్ ఎస్ విద్యార్థిని ఎనగందుల తేజస్విని ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిందని తాండూర్ మండల విద్యాధికారి, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు దుర్గం శ్రీనివాస్ తెలిపారు. మార్చి 2006లో నిర్వహించిన ఎస్సెస్సీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో తాండూర్ మండల స్థాయిలో 560 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన తేజస్విని తాజాగా విడుదలైన ట్రిపుల్ ఐటి ప్రవేశ ఫలితాల్లో సీటు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. చౌటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోచంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని త్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల తాండూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఎనగందుల తేజస్విని శాలువాతో సన్మానించారు. విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ప్రత్యేక ఓటర్ సవరణకు అందరూ సహకరించాలి

## తహశీల్దార్ రామ్మోహన్‌రావు




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని బెజ్జూర్ మండల తహశీల్దార్ రామ్మోహన్ రావు కోరారు. బుధవారం మండలంలోని ఉమ్మడి సలగుపల్లి గ్రామపంచాయతీలో ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటర్ సవరణలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, తొలగింపులు, తప్పుల సవరణలు చేపడుతున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు, ఫొటో, చిరునామా తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సరిచేసుకోవాలని సూచించారు. మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు ప్రజలు సంబంధిత సమాచారాన్ని అందించాలని కోరారు. బీఎల్ఓలు ఇంటింటికీ వచ్చినప్పుడు సరైన వివరాలు అందించి సహకరించాలని, అవసరమైతే ఆన్లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పారదర్శకంగా, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించేందుకు ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చినుకు పడితే చీకటే..!

## రాత్రింబవళ్లు గంటల తరబడి విద్యుత్ కోతలు

## తీవ్ర ఇబ్బందుల్లో మండల ప్రజలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలో విద్యుత్ సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. మే నెలాఖరు నుంచి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతుండటంతో మండలవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, స్వల్పంగా గాలులు వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ తీగలు చెట్లు, పొదలను తాకే విధంగా ఉండటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగల మధ్యలోకి చొచ్చుకుపోయాయి. ఈదురుగాలులు వీచిన సమయంలో కొమ్మలు తీగలకు తగలడంతో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. విద్యుత్ లోపాలు తలెత్తితే వాటిని వెంటనే సరిచేయకపోవడంతో ప్రజలు రాత్రంతా చీకట్లోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు వాతావరణ మార్పులే కారణమని అధికారులు చెబుతున్నప్పటికీ, వర్షాకాలం ప్రారంభానికి ముందే నివారణ చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గంటల తరబడి విద్యుత్ కోతలు విధించడంతో దైనందిన జీవనం అస్తవ్యస్తమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, మరమ్మతు పనులు వేగవంతం చేయడం ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా ఎం. తిరుపతి బాధ్యతల స్వీకరణ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా మెకర్తి తిరుపతి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సూపరిండెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు గతంలో ఇంచార్జ్ DMWO గా కొనసాగిన అహ్మద్ నదీమ్ సిద్ధికి నుంచి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం నూతనంగా పదవి బాధ్యతలను స్వీకరించిన తిరుపతి కలెక్టర్ హరిత ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక నిరంతర ప్రక్రియగా కొనసాగాలి**
- **జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు**
- **జిల్లా లో ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక విజయవంతం: కలెక్టర్ రాజర్షి షా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం 99 రోజులకే పరిమితం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన 99 రోజుల కార్యక్రమంలో 10 శాఖలకు సంబంధించిన లక్ష్యాలను అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేశారని తెలిపారు. కార్యక్రమం ముగిసినప్పటికీ అదే స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కొనసాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిందని పేర్కొన్నారు. గ్రామసభలు, మండల స్థాయి సమావేశాల్లో ప్రజల నుంచి స్వీకరించిన వ్యక్తిగత, సామూహిక, సంస్థాగత వినతులను శాఖల వారీగా క్రోడీకరించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అనుభవాలు, ఫీడ్బ్యాక్ ఆధారంగా ప్రతి శాఖ ఒకటి నుంచి రెండు సంవత్సరాల కాలానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి పర్యటనల సందర్భంగా మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 131 రెసిడెన్షియల్ విద్యాసంస్థలను జిల్లా అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించాలని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కింద పారిశుధ్యం, ఆరోగ్యం, ఫైళ్ల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి, డీజీపీ పర్యటనలు విజయవంతంగా నిర్వహించామని, ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అలాగే జిల్లాలో సాధించిన విజయాలు, సంక్షేమ పథకాల అమలు, ఫిర్యాదుల పరిష్కారం, నూతన ఆవిష్కరణలతో కూడిన సమగ్ర ప్రగతి నివేదికను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికకు సంబంధించిన బుక్లెట్ను జిల్లా ప్రత్యేక అధికారి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్ఎ స్. చిత్రు, రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గిరిజనులకు మెరుగైన సేవలే లక్ష్యం

- **గిరిజన సహకార సంస్థ డీఎం గుడిమళ్ల సందీప్ కుమార్**
- **డీఆర్ డిపో ఆకస్మిక తనిఖీ**





**ఉద్యమ కెరటం, జైనూర్:** గిరిజనులకు మెరుగైన సేవలే లక్ష్యమని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ అన్నారు. జైనూర్ మండలంలోని ఉషేగావ్ నిత్యావసర వస్తువుల విక్రయ కేంద్రం (డీఆర్ డిపో)ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలోని బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల నిల్వలను పరిశీలించి స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. రేషన్ కార్డు లబ్ధి దారులకు పంపిణీ చేసే బియ్యం నిల్వలు ఈ–పాస్ ఆన్లైన్ నమోదుతో సరిపోతున్నాయా.. లేదా అనే విషయాన్ని సమీక్షించారు. అనంతరం జైనూర్ మండల కేంద్రంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును సందర్శించారు. ఇంధన విక్రయాల వివరాలను సేల్స్ మేనేజర్ విజయను అడిగి తెలుసుకున్నారు. డీఆర్ డిపో, పెట్రోల్ బంకుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సిబ్బందికి సూచించారు. నిత్యావసర వస్తువుల విక్రయాలను మరింత పెంచడంతో పాటు ఆదివాసీ గిరిజనులు సేకరించే ఇప్పపువ్వు, తేనె తదితర అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లను విస్తరించాలని ఆదేశించారు. గిరిజనులకు మెరుగైన సేవలు అందించే దిశగా జీసీసీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

# 30న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు

- **సీఎస్సీ హెల్త్ టెస్టుల పేరుతో ఖజానా ఖాళీ చేస్తారా..?**
- **బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాసరావు**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో పర్యటించిన ఆయన స్థానికంగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. సీఎస్సీ హెల్త్ టెస్టుల పేరుతో భవన నిర్మాణ కార్మికుల నుంచి రక్త నమూనాలు సేకరించి, ఉపయోగం లేని నివేదికలు ఇస్తూ వారిని భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రతి కార్మికుడి పేరుతో రూ.3,600 చొప్పున కోట్లాది రూపాయలు వెల్ఫేర్ బోర్డు నుంచి తీసుకుంటూ పతకం ప్రకారం ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. సీఎస్సీ టెస్టుల పేరుతో ఖజానాను ఖాళీ చేస్తున్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్మికులు నేరుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం అందించే విధానాన్ని అమలు చేయాలని, సీఎస్సీ లీజును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. కార్మికులు దీనికి తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. అలాగే మరణించిన కార్మికుల కుటుంబాలకు సహాయం అందించే బాధ్యతను వెల్ఫేర్ బోర్డు నుంచి తొలగించి ట్రైల్ బ్లేజర్ అనే ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థకు అప్పగించడం ద్వారా కార్మికుల భద్రతను ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. గత ఏడాది ఆ సంస్థకు రూ.300కోట్లు చెల్లించినప్పటికీ, మరణించిన కార్మికుల కుటుంబాల్లో సగం మందికి కూడా పరిహారం అందలేదని పేర్కొన్నారు. బోర్డు చైర్మన్ లేఖ కావాలంటూ సాకులు చెబుతూ పరిహారాల చెల్లింపులను ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. వచ్చే నెలలో ట్రైల్ బ్లేజర్ సంస్థ లీజు పునరుద్ధరణ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 30న ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధోనోజు లక్ష్మణాచారి, ఉపాధ్యక్షులు బోయినపల్లి వీరబాబు, మల్లూరు చంద్రశేఖర్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠలావు, జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు, ఓలేటి శ్రీహరి, నాగుల మీరా, తిప్పిశెట్టి శివ, అబ్దుల్ రెహ్మాన్, గుడిమెట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## జైనూర్ సీఐ రమేష్




**ఉద్యమ కెరటం, జైనూర్:** మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటికి దూరంగా ఉండాలని జైనూర్ సీఐ ఈ. రమేష్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సై రవి కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని భూసిమెట్ట గ్రామంలోని టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ బాలికల పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మాదకద్రవ్యాల వినియోగంsy కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యాభ్యాసంపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి సమాజాన్ని వ్యసన రహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత అపరిచితుల ప్రలోభాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు "డ్రగ్స్కు నో చెప్పండి.. ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ముస్లిం ల మనోభావాలు దెబ్బ తీయడం సరికాదు

- ప్రవక్త పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** మహమ్మద్ ప్రవక్తను కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన అడ్వకేట్ నాజియా ఇలాహి ఖాన్‌పై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కఠిన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన తంజీమ్ రజా ఏ ఇలాహి, ఆహ్ లే సున్నత్ వల్ జమియాత్ కమిటీల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పోలీసు అధికార యంత్రాంగానికి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఒక సామాజిక మాధ్యమం వేదికగా నాజియా ఇలాహి ఖాన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం ల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఇటువంటి వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఏ మతాన్ని లేదా ప్రవక్తలను తక్కువ చేసి మాట్లాడే హక్కు ఎవరికీ లేదని, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించిన ఆమెపై కొత్త భారతీయ న్యాయ సంహిత చట్టా ల ప్రకారం తక్షణమే కేసు నమోదు చేయాలని కోరారు.భవిష్యత్తులో ఇటువంటి ఉదంతాలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే సదరు నాయకురాలిని కఠినంగా శిక్షించాలని, దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని, మత



సామరస్యాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని ఈ సందర్భంగా ప్రతినిధులు స్పష్టం చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, నాయకులు సయ్యద్ జావిద్, సాజిద్, షబ్బీర్, సమద్ , సాలం, షాకీర్, రైస్ ఖాన్, జహర్ పాషా, జాఫర్ సాదిక్ హుస్సేన్, తాజ్ , సయ్యద్ మజీద్, వాజిద్, అహ్మద్ ఖా, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కనిపించడం లేదు

- రైతుబంధు తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్దే
- ఈసారి సత్తుపల్లి లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కనిపించడం లేదని, రైతుబంధు తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్దే నని, ఈసారి సత్తుపల్లిలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. జేవియర్ కళాశాల ప్రాంగణానికి హెలికాప్టర్లోచేరుకున్న కేటీఆర్కు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో బీఆర్ఎస్ ఓటమి పాలైందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సత్తుపల్లి నియోజక వర్గంలో విజయం సాధించేది బీఆర్ఎస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందలేదని, రైతుబంధు పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్, గురుకుల విద్యా వ్యవస్థ, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ఖమ్మం జిల్లా అభివృద్ధితో పాటు సీతారామ ప్రాజెక్టు పనుల్లో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర కీలకమని తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రులు గత రెండున్నరేళ్ల లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. భూముల కేటాయింపులు, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన మట్టి అక్రమ తరలింపులపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ పార్ల మెంట్ సభ్యుడు నామ నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, లింగాల కమల్ రాజు, మాజీ డీసీసీబీ అధ్యక్షుడు నాగభూషణం, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్, రాకేష్ రెడ్డి, రామ్మూర్తి, సత్తుపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ఉమా, మాజీ జెడ్పీటీసీలు, మండల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి





- ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డీఎస్పీ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాలు యువత ఉజ్వల భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తాయని డీఎస్పీ అశోక్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకుని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా కేవలం చదువుపైనే శ్రద్ధ పెట్టాలని పిలుపు నిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం, కొనుగోలు, విక్రయాలు చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, దీనివల్ల జీవితాలు జైలు పాలు అవుతాయని హెచ్చరించారు. మీ పరిసరాల్లో ఎవరైనా మాదకద్రవ్యాల సరఫరా లేదా విని యోగానికి పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే ఉచిత హెల్ప్‌లైన్ నంబర్ డయల్ 112 ద్వారా గానీ, లేదా స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందించి బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు.అనంతరం డీఎస్పీ అశోక్ పాఠశాల భోజనశాలలో విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేస్తూ విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. పాఠశాలలో కల్పిస్తున్న విద్యాభ్యాసం, వసతులు, లభిస్తున్న భోజన సదుపాయాల నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులను ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, స్థానిక ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీడిమెట్ల లో మహిళా శక్తికి చీరల కానుక

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్** జీడిమెట్ల సర్కిల్‌లో బుధవారం మహిళల సందడి కనిపించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐఏఎస్ కార్యక్రమానికి హాజరై చీరల పంపిణీని ప్రారంభించారు. జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు మొత్తం 22,745 చీరలను పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.పేద మరియు మధ్యతరగతి మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంలో స్వయం సహాయక సంఘాలు కీలకంగా మారాయని పేర్కొన్నారు. చీరల పంపిణీ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నెన్నెల మండలం పుప్పల్వానిపేట గ్రామంలో నిర్వహించిన భూ సర్వే అవగాహన సదస్సుకు ఎడిఎస్ఎల్ ఆర్ శ్రీనివాస్, మండల తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ హైలతో కలిసి హాజరై ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి పరిష్కరిస్తున్నామని తెలిపారు. భూ సర్వేను సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఒకసారి పొరపాటు జరిగితే సవరించేందుకు సమయం పడుతుందని పేర్కొన్నారు. దీంతో పట్టాదారులు తమ భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారించుకుని, అవసరమైన పత్రాలతో సర్వేలో పాల్గొనాలని సూచించారు. అర్హులైన వారికే సర్వే ప్రకారం ప్రయోజనాలు కల్పిస్తామని, బోగస్ దరఖాస్తులను రద్దు చేయడంతో పాటు వివాదాస్పద భూముల సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. సర్వే సమగ్రంగా పూర్తయితే భవిష్యత్తులో భూ వివాదాలకు తావు ఉండదన్నారు. అంతకుముందు మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి విధుల్లో సమయ పాలన పాటించాలని సూచించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కొన్నంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. వాటిని త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కాట్రియాల్ రైతు వేదికలో రైతుల కు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం.

- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలి.
- నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు సూచనలు.
- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన.

**ఉద్యమ కెరటం,రామాయంపేట :** రామాయంపేట మండలం కాట్రియాల్ రైతు వేదికలో రైతులకు వివిధ రకాల విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వినియోగం, పప్పు దినుసుల మెరుగైన రకాలు, అధిక దిగుబడినిచ్చే వడ్ల సన్న రకాల సాగు విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు.రైతు వేదికలో సన్న రకం వడ్ల విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, వివిధ రకాల కూరగాయల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పంటల పెరుగుదల, దిగుబడి పెంపునకు ఉపయోగపడే నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.వ్యవసాయంలో కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంతో పాటు దిగుబడిని పెంచుకోవచ్చని రైతులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా, ఉపసర్పంచ్ బాబు నాయక్, తిరుపల్లి శ్రీశైలం రెడ్డి, బిల్లం శ్యామ్ రెడ్డి, ద్యాగాల రాజు, శెణిశెట్టి శ్రీనివాస్, బిక్షపతి, మల్లా రెడ్డి, పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అల్వాల్ లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని

**ఉద్యమ కెరటం,అల్వాల్:-** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నానక్‌రామ్ గూడలోని డైరెక్టర్ జనరల్ ఫైర్ అండ్ డిజాస్టర్ సర్వీసెస్ కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ ఫైర్ సేఫ్టీ విక్రమ్ సింగ్,ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అల్వాల్ ప్రాంతంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రతిపాదించిన అంశాలను త్వరితగతిన పూర్తి చేసి ఫైర్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.అల్వాల్ పరిసర ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో అగ్నిప్రమాదాలు,అత్యవసర పరిస్థితుల సమయంలో సత్వర సేవలు అందించేందుకు ఫైర్ స్టేషన్ ఏర్పాటు అత్యంత అవసరమని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక ప్రజల భద్రత దృష్ట్యా ఈ ప్రతిపాదనకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే వినతిపై డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ ఐపీఎస్ సానుకూలంగా స్పందించి,సంబంధిత ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పాకిస్థాన్ క్రికెట్‌లో భారీ మార్పులు!

- టెస్టు, వన్డే, టీ20లకు వేర్వేరు జట్లు..!
- కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ విధానానికి పీసీబీ సన్నాహాలు




**లాహోర్, జూన్ 24:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) జాతీయ జట్టు నిర్మాణంలో కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది. భవిష్యత్తులో టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్లకు వేర్వేరు జట్లను రూపొందించే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి పీసీబీ కసరత్తు ప్రారంభించింది. పీసీబీ సీనియర్ సెలెక్టర్, హై పెర్ఫార్మెన్స్ సెంటర్ అధిపతి అఖీబ్ జావేద్ మాట్లాడుతూ ఆధునిక క్రికెట్‌లో ఒకే ఆటగాడు మూడు ఫార్మాట్లలోనూ సమర్థంగా రాణించడం క్రమంగా కష్టతరమవుతోందన్నారు. ప్రతి ఫార్మాట్‌కు వేర్వేరు నైపుణ్యాలు అవసరమవుతున్నాయని, ముఖ్యంగా టెస్టు మరియు టీ20 క్రికెట్‌ల మధ్య పూర్తిగా భిన్నమైన దృక్పథం అవసరమని వివరించారు.

### ఫార్మాట్‌ల వారీగా ప్రత్యేక విభాగాలు

కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ విధానంలో ఆటగాళ్లను వారి ప్రదర్శన, ప్రత్యేకతల ఆధారంగా వేర్వేరు విభాగాలుగా విభజించనున్నారు. టెస్టు స్పెషలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంతో పాటు, వారి ప్రదర్శనకు అనుగుణంగా అధిక వేతనాలు చెల్లించే విధానాన్ని కూడా పరిశీలిస్తున్నారు. టెస్టు–వన్డే, వన్డే–టీ20, టెస్టు–టీ20 వంటి కలయిక విభాగాలతో పాటు పూర్తిగా ఒక్కో ఫార్మాట్‌కు ప్రత్యేక కేటగిరీలు రూపొందించే అవకాశముంది. దీని ద్వారా ప్రతి ఫార్మాట్‌కు అనుగుణమైన ఆటగాళ్లను తయారుచేయడం, జట్ల సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

### టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యం

ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌ల ప్రభావం పెరుగుతున్న తరుణంలో టెస్టు క్రికెట్ ప్రాధాన్యం తగ్గిపోకుండా చూడాలని పీసీబీ భావిస్తోంది. అందుకే టెస్టు క్రికెట్‌లో రాణించే ఆటగాళ్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, అధిక పారితోషికం అందించే దిశగా ఆలోచిస్తోంది.


### ప్రపంచ క్రికెట్‌పై ప్రభావం?

పాకిస్థాన్ అమలు చేయబోతున్న ఈ విధానం విజయవంతమైతే ఇతర దేశాలు కూడా ఇదే తరహా వ్యవస్థను అనుసరించే అవకాశముందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకే దేశం నుంచి మూడు ఫార్మాట్లకు దాదాపు వేర్వేరు జట్లు బరిలోకి దిగే పరిస్థితి భవిష్యత్తులో ఏర్పడవచ్చని వారు అంచనా వేస్తున్నారు. పాకిస్థాన్ క్రికెట్‌లో చేపట్టబోతున్న ఈ సంస్కరణలు జట్టు ప్రదర్శనను ఎంతవరకు మెరుగుపరుస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్లకు ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళ్లాలని పీసీబీ భావిస్తుండటంతో ప్రపంచ క్రికెట్ వర్గాలు ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్ల జోరు

**గిల్ రెండో స్థానం, బుమ్రాకు అగ్రస్థానం**



**దుబాయ్, జూన్ 24 :** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు అద్భుతంగా రాణించారు. వన్డే బ్యాటింగ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో స్థానానికి ఎగబాకగా, టెస్ట్ బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానాన్ని న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీతో పంచుకున్నాడు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో డారిల్ మిచెల్ మొదటి స్థానంలో కొనసాగుతుండగా, గిల్ కేవలం 24 రేటింగ్ పాయింట్ల తేడాతో రెండో స్థానంలో నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్‌పై జరిగిన సిరీస్‌లో గిల్ స్థిరమైన ప్రదర్శనతో మూడు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. అదే సిరీస్‌లో ఇషాన్ కిషన్ 21 స్థానాలు ఎగబాకి 43వ ర్యాంకుకు చేరడం విశేషం. భారత బౌలింగ్ విభాగంలో కూడా మెరుగుదల కనిపించింది. అర్ష్‌దీప్ సింగ్ 16 స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకుకు చేరగా, ప్రసిద్ధ్ కృష్ణ 34 స్థానాలు మెరుగుపరుచుకుని 58వ స్థానంలో నిలిచాడు. వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్ల జాబితాలో 71వ స్థానాన్ని సాధించాడు. టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్లు తీసిన మాట్ హెన్రీ, బుమ్రాతో కలిసి సంయుక్తంగా నంబర్ వన్ స్థానాన్ని పంచుకున్నాడు. 2024 నవంబర్ నుంచి ఒంటరిగా అగ్రస్థానంలో ఉన్న బుమ్రాకు ఇది కొత్త పోటీగా మారింది. టెస్ట్ బ్యాటింగ్‌లో ఇంగ్లండ్ స్టార్ జో రూట్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని తిరిగి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇది ఆయన కెరీర్‌లో 12వసారి ఈ ఘనత సాధించడం గమనార్హం. టీ20 ర్యాంకింగ్స్‌లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. ఆస్ట్రేలియా తరఫున మిచెల్ మార్ష్ టాప్–10లోకి చేరగా, బంగ్లాదేశ్ బౌలర్ నసుమ్ అహ్మద్ ఏకంగా 27 స్థానాలు ఎగబాకి 11వ ర్యాంకుకు చేరాడు.

# స్టోక్స్–మెక్‌కల్లమ్ మధ్య విభేదాలపై క్లారిటీ

**న్యూఢిల్లీ, జూన్ 24:** ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్, ప్రధాన కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ మధ్య విభేదాలు ఉన్నాయంటూ కొంతకాలంగా వస్తున్న వార్తలకు తాజాగా స్పష్టత వచ్చింది. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు ప్రారంభానికి ముందు మెక్‌కల్లమ్ ఈ అంశంపై స్పందిస్తూ, సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పాడు. స్టోక్స్ తనకు మంచి స్నేహితుడని, ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో తొలి టెస్టు అనంతరం జరిగిన ఓ ఘటన నేపథ్యంలో ఇద్దరి పేర్లు ప్రస్తావనకు రావడంతో ఈ చర్చ మరింత వేడెక్కింది. అయితే ఆ సంఘటనతో తమకు సంబంధం లేదని మెక్‌కల్లమ్ వివరించాడు. స్టోక్స్‌తో కలిసి ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నామని, జట్టు ప్రయోజనాలే తమకు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. 2022లో ఇంగ్లండ్ టెస్టు జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్, స్టోక్స్‌తో కలిసి 'బజ్‌బాల్' అనే దూకుడైన ఆటతీరును ప్రవేశపెట్టి జట్టు ప్రదర్శనను పూర్తిగా మార్చారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య సమన్వయం కీలక పాత్ర పోషించింది. మరోవైపు నైట్‌క్లబ్ ఘటన నేపథ్యంలో గతంలో స్టోక్స్, పేసర్ అట్కిన్సన్‌పై రెండో టెస్టుకు వేటు పడింది. అయితే విచారణ అనంతరం వారికి క్లీన్‌చిట్ లభించడంతో స్టోక్స్ మూడో టెస్టుకు తిరిగి జట్టులో చేరాడు. సిరీస్ ప్రస్తుతం 1–1తో సమంగా ఉండగా, నిర్ణయాత్మక మూడో టెస్టు కోసం ఇంగ్లండ్ జట్టు సన్నద్ధమవుతోంది.






# ఆసియా క్రీడల ఎంపికపై మానికా బాత్రా ఆగ్రహం

**న్యూఢిల్లీ, జూన్ 24:** భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మానికా బాత్రా ఆసియా క్రీడల జట్టు ఎంపికపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తనను జట్టు నుంచి తప్పించడానికి గల కారణాలను స్పష్టంగా వివరించకపోతే చట్టపరమైన చర్యలకు వెళ్తానని ఆమె టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాను హెచ్చరించింది. ఈ అంశంపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని మానికా మరోసారి విజ్ఞప్తి చేసింది. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంపై ఆమె పలు ప్రశ్నలు లేవనెత్తింది. ర్యాంకింగ్స్ ఆధారంగా ఎంపిక జరిగిందా లేదా ఇతర ప్రమాణాలు పరిగణనలోకి తీసుకున్నారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం తాను ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 51వ స్థానంలో ఉన్నప్పటికీ, ఎంపికలో ఉపయోగించిన కాలవ్యవధి ఏమిటో తెలియజేయలేదని ఆమె పేర్కొంది. గతంలో భారత్‌కు పతకాలు అందించిన ఆటగాళ్లను కూడా ఈసారి పరిగణనలోకి తీసుకోకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించింది. టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఎంపిక నిర్ణయాలు ఎవరు తీసుకుంటారన్నదానిపై కూడా ఆమె సందేహాలు వ్యక్తం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో అనుభవం ఉన్న మాజీ క్రీడాకారులు ఈ నిర్ణయాల్లో ఎంతవరకు భాగస్వాములు అవుతున్నారో స్పష్టం చేయాలని ఆమె కోరింది. జపాన్‌లో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఆసియా క్రీడల నేపథ్యంలో ఈ వివాదం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# మహిళా క్రికెటర్లకు ఐసీసీ కొత్త గైడ్‌లైన్స్‌పై సచిన్ టెండూల్కర్ హర్షం

**న్యూఢిల్లీ, జూన్ 24:** మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన కొత్త మార్గదర్శకాలపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రసవానంతరం మహిళా క్రీడాకారిణులు మళ్లీ మైదానంలోకి తిరిగి రావడానికి ఈ నిబంధనలు పెద్ద ఊతమని ఆయన అభివర్ణించారు. మాతృత్వం మరియు వృత్తిగత కెరీర్‌ను సమన్వయం చేసుకునే అవకాశం కల్పించే విధంగా ఈ మార్గదర్శకాలు రూపొందించబడటం మహిళా క్రికెట్‌కు చారిత్రాత్మక అడుగుగా సచిన్ పేర్కొన్నారు. మహిళా క్రీడాకారిణులు తమ కుటుంబ బాధ్యతల కారణంగా కెరీర్‌ను మధ్యలో ఆపాల్సిన పరిస్థితి ఇకపై తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా 'రిటర్న్ టు ప్లే పోస్ట్–ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను విడుదల చేసింది. గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో, ప్రసవం తర్వాత క్రీడాకారిణుల శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మొత్తం ఆరు దశల విధానాన్ని ఇందులో పొందుపరిచారు. ప్రపంచ క్రికెట్ చరిత్రలో మహిళా క్రీడాకారిణుల కోసం ఇలాంటి సమగ్ర విధానం తీసుకురావడం ఇదే మొదటిసారి. ఈ మార్గదర్శకాలు మహిళా క్రికెటర్లు దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని మాతృత్వం కారణంగా కోల్పోకూడదనే ఉద్దేశంతో రూపొందించబడినట్లు ఐసీసీ ఛైర్మన్ జై షా తెలిపారు. ఈ నిర్ణయం మహిళా క్రికెట్ అభివృద్ధికి కీలక మలుపు అవుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.




# షోయబ్ అక్తర్ ఇంట విషాదం

**ఇస్లామాబాద్, జూన్ 24:** పాకిస్థాన్ మాజీ క్రికెటర్, "రావల్పిండి ఎక్స్‌ప్రెస్"గా ప్రసిద్ధి చెందిన షోయబ్ అక్తర్ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు షాహిద్ అక్తర్ మృతి చెందినట్లు పాకిస్థాన్ మీడియా వెల్లడించింది. ఈ విషయాన్ని షోయబ్ అక్తర్ స్వయంగా తన ఎక్స్ ఖాతాలో ధృవీకరించారు. తన సోదరుడు షాహిద్ అక్తర్ అల్లా వద్దకు చేరుకున్నారని పేర్కొంటూ భావోద్వేగ సందేశం పోస్ట్ చేశారు. అయితే ఆయన మృతికి గల కారణం ఇప్పటివరకు స్పష్టంగా తెలియరాలేదు. ఈ ఘటనపై క్రికెట్ అభిమానులు, మాజీ పాకిస్థాన్ క్రికెటర్లు సోషల్ మీడియాలో సంతాపం వ్యక్తం చేస్తున్నారు. మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ కూడా షాహిద్ అక్తర్ మృతికి నివాళి అర్పించారు. ఆయన అంత్యక్రియలు హెచ్–8 శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు సమాచారం. గతంలో షోయబ్ అక్తర్ తల్లి కూడా మృతి చెందడంతో కుటుంబం మరోసారి విషాదంలో మునిగిపోయింది. ఇటీవల ఆయన క్రికెట్ పండిట్‌గా మారి టీ20 వరల్డ్ కప్ సహా పలు మ్యాచ్‌లపై తన విశ్లేషణలు, అభిప్రాయాలను పంచుకుంటూ వస్తున్నారు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో కొలంబియా సత్తా.. నాకౌట్‌కు అర్హత

**న్యూఢిల్లీ, జూన్ 24:** అంతర్జాతీయ ఫుట్‌బాల్ వేదికపై కొలంబియా జట్టు అద్భుత ప్రదర్శనతో సరికొత్త రికార్డు నమోదు చేసింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్‌లో గ్రూప్ దశను విజయవంతంగా పూర్తి చేసి నాకౌట్ దశకు అధికారికంగా అర్హత సాధించింది. బుధవారం జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో కొలంబియా జట్టు కాంగో డీఆర్‌ను 1–0 తేడాతో ఓడించింది. ఈ విజయంతో కొలంబియా తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లింది. మ్యాచ్ మొత్తం ఇరు జట్లు గట్టి డిఫెన్స్‌తో ఆడగా, తొలి అర్ధభాగంలో గోల్స్ నమోదు కాలేదు. కొలంబియా తరఫున జేమ్స్ రోడ్రిగెస్, లూయిస్ డియాజ్, జాన్ ఆరియాస్ వంటి స్టార్ ఆటగాళ్లు అనేక అవకాశాలు సృష్టించినప్పటికీ ఫలితం రాలేదు. అయితే 76వ నిమిషంలో మ్యాచ్ మలుపు తిరిగింది. జువాన్ క్వింటెరో అందించిన అద్భుతమైన పాస్‌ను డేనియల్ మునోజ్ వండర్ గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యం అందించాడు. ఆ ఒక్క గోల్‌ను చివరి వరకు కాపాడుకున్న కొలంబియా విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో కొలంబియా జట్టు నాకౌట్ దశలోకి ప్రవేశించి టోర్నమెంట్‌లో తన ఆశలను మరింత బలపరుచుకుంది.



# చరణ్‌పై మోడీ ప్రశంసలతో పులకించా

మెగాస్టార్ చిరంజీవి తన కుమారుడు రామ్ చరణ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల 'పెద్ది' సినిమాతో సూపర్ హిట్‌ను అందుకుని టాప్ ట్రెండింగ్‌లో ఉన్న రామ్ చరణ్ రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించారు. దీనిపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సుమతీ శతక పద్యంతో తన పోస్ట్‌ను ప్రారంభించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ'. అని రాస్తూ కొడుకు పుట్టగానే తండ్రికి నిజమైన సంతోషం కలగదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని చూసి జనాలు మెచ్చుకున్నప్పుడే ఆ తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు. తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకోవడం నిజంగా సంతోషకరమని పేర్కొన్నారు. ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చిరంజీవి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.






# ఫోక్ క్వీన్ నాగదుర్గకు వరుస ఆఫర్లు..


## టాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ

యూట్యూబ్ వేదికగా తెలంగాణ ఫోక్ డ్యాన్స్‌లతో గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఇప్పుడు వెండితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. సోషల్ మీడియాలో భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ యువ నటి ఇప్పుడు వరుస సినిమా అవకాశాలతో బిజీగా మారింది. ఇప్పటికే తమిళంలో తెరకెక్కుతున్న 'లవ్ ఓ లవ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న నాగదుర్గ, వెండితెరపై తన తొలి అడుగు వేసింది. దర్శకుడు మగేష్ రాజేంద్రన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో పవిష్ నారాయణ్ సరసన ఆమె ఫీమేల్ లీడ్‌గా నటిస్తోంది. ఇది ఆమెకు తమిళ చిత్రసీమలో తొలి అవకాశం కావడం విశేషం. ఇక టాలీవుడ్‌లో కూడా నాగదుర్గకు పెద్ద అవకాశం దక్కినట్లు సమాచారం. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఓ గ్రామీణ కుటుంబ నేపథ్య కథలో ఆమె హీరోయి-న్‌గా ఎంపికైనట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ఒకప్పుడు యూట్యూబ్‌లో ఫోక్ వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నాగదుర్గ ఇప్పుడు వరుసగా సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ వెండితెర వైపు వేగంగా అడుగులు వేస్తోంది. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే పాత్రల్లో ఆమె నటన ఎలా ఉంటుందోనన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. మరోవైపు గతంలో సుకుమార్ చిత్రంలో చిన్న పాత్ర చేసిన ప్రియదర్శి ఇప్పుడు అదే బ్యానర్‌లో హీరోగా నటించనుండటం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారింది.

# బోనీకపూర్ ఇంట్లో పెళ్లి సందడి




బాలీవుడ్‌లో మరో స్టార్ వెడ్డింగ్‌కు రంగం సిద్ధమైంది. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కుటుంబంలో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఆయన పెద్ద కుమార్తె అన్షులా కపూర్ వివాహ వేడుకలు ముంబైలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తన లాంగ్‌టైమ్ బాయ్‌ఫ్రెండ్ రోహన్ థక్కర్‌తో అన్షులా త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టనుండగా, ప్రస్తుతం ప్రీ వెడ్డింగ్ వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య సందడిగా సాగుతున్నాయి.గత ఏడాది న్యూయార్క్‌లో సన్నిహితుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్న అన్షులా-రోహన్ జంట ఇప్పుడు జూలై 6న పెళ్లి పీటలెక్కబోతోంది. దీంతో కపూర్ కుటుంబంలో ఇప్పటికే పెళ్లి సందడి మొదలైంది. ఈ వివాహ వేడుకల తొలి కార్యక్రమంగా ముంబైలో సంప్రదాయబద్ధంగా 'మాతా కీ చౌకీ' పూజను నిర్వహించారు. వరుడు రోహన్ థక్కర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను అన్షులా సోషల్ మీడియాలో పంచుకుంటూ, 'ప్రేమ, కుటుంబం, దేవుని ఆశీస్సులతో మా కొత్త ప్రయాణం ప్రారంభమవుతోంది' అంటూ భావోద్వేగ పోస్ట్ చేసింది.అన్షులా పెళ్లి వేడుకల్లో అన్నయ్య అర్జున్ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. తల్లి మోనా శౌరీ కపూర్ మరణం తర్వాత అన్షులాకు అర్జున్ కపూరే అండగా నిలిచారు. చెల్లెలి బాధ్యతలను తన భుజాలపై వేసుకుని కుటుంబానికి పెద్దగా వ్యవహరించిన అర్జున్, ఇప్పుడు ఆమె పెళ్లి ఏర్పాట్లను కూడా దగ్గరుండి చూసుకుంటున్నారు. శ్రీదేవి మరణం తర్వాత ఈ నలుగురు తోబుట్టువులు మరింత దగ్గరయ్యారు. ఇప్పుడు అన్షులా పెళ్లి వేడుకల్లో ఆ అనుబంధం స్పష్టంగా కనిపిస్తోంది.జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లు పెళ్లి ఏర్పాట్లలో చురుకుగా పాల్గొంటూ అక్కకు అండగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేస్తూ, డాన్స్‌లు చేస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా మారారు. సోనమ్ కపూర్, రియా కపూర్‌లతో కలిసి ఒకే ఫ్రేమ్‌లో కనిపించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో ఈత

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచు కుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.

# సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు 'సర్దార్ 2'




తమిళ స్టార్ హీరో కార్తీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాలో కార్తీ మ-రోసారి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే మొదటి భాగం యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రంలో కార్తీ సరసన మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్య 'బ్లాక్ డాగర్' పాత్రలో పవర్‌ఫుల్ విలన్‌గా కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అలాగే కమెడియన్ యోగి బాబు కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. సాంకేతిక విభాగం కూడా ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, జార్జ్ సి విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయ్ వేలుకుట్టి ఎడిటింగ్ చేయగా, యాక్షన్ సన్నివేశాలను దిలీప్ సుబ్బరాయన్ రూపొందిస్తున్నారు. మొదటి భాగాన్ని మించిన యాక్షన్, మరింత థ్రిల్లింగ్ అంశాలతో 'సర్దార్ 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది. విడుదల తేదీ ఖరారవడంతో కార్తీ అభిమానుల్లో సినిమా పట్ల ఉత్సాహం మరింత పెరిగింది.

# 'ధర్మన్'గా రానున్న రజినీకాంత్ కొత్త సినిమా

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'తలైవర్ 173' టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. "ధర్మం వర్ధిల్లుతుంది" అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. పోస్టర్‌ను బట్టి చూస్తే ఈ చిత్రంలో రజినీకాంత్ డాక్టర్ పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ చిత్రాన్ని ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, అన్బరివ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. రజినీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఈ సినిమా తెరకెక్కుతుండటంతో కోలీవుడ్‌లో భారీ చర్చ నడుస్తోంది. రెండు లెజెండ్లు ఒకే ప్రాజెక్ట్ కోసం కలిసి పనిచేస్తుండటంతో అటు రజినీ అభిమానులు, ఇటు కమల్ అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే 'ధర్మన్' సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, మిగతా నటీనటుల వివరాలను చిత్ర బృందం త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**